ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు తెలుగు రాష్ట్రాల్లో వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలైంది. ఎంసెట్ ర్యాంకులు పొందినవారు సీటు పొందాలంటే దీనిలో పాల్గొనాల్సి ఉంటుంది. మంచి ర్యాంకు తెచ్చుకోవటం ఒక్కటే కాదు; తగిన ఆప్షన్లు ఇవ్వటమూ చాలా ముఖ్యం. అలా చేస్తేనే నచ్చిన కళాశాలలో కోరుకున్న బ్రాంచి దక్కుతుంది. ఏమాత్రం నిర్లక్ష్యం చూపించినా సీటు కేటాయింపు జరక్కపోవచ్చు. లేకుంటే దొరికినదానితో సంతృప్తి పడాల్సివుంటుంది. అందుకే కౌన్సెలింగ్ సందర్భంగా ఏ మెలకువలు పాటించాలో తెలుసుకుందాం!

ఎంసెట్ ఇంజినీరింగ్ వెబ్ కౌన్సెలింగ్- 2018

ర్యాంకు ఏదైనా ఆప్షన్లే కీలకం!

ఎంసెట్ ఇంజినీరింగ్‌లో ఉత్తమ ర్యాంకు సంపాదించినా వెబ్ ఆప్షన్ల విషయంలో చేసే చిన్న చిన్న పొరపాట్లు ఉజ్వల భవిష్యత్తును సమస్యల్లోకి నెడతాయి. ప్రతి సంవత్సరం ఇలా నష్టపోయేవారు వందల సంఖ్యలో ఉంటున్నారు. చివరకు మంచి ర్యాంకు వచ్చినా తనకు రాకుండా పెద్ద ర్యాంకు వారికి సీట్లు ఎలా వచ్చాయని ఆవేదన వ్యక్తంచేస్తుంటారు. అందుకు కారణం వెబ్ ఆప్షన్ల నమోదులో చూపే నిర్లక్ష్యం, అవగాహన రాహిత్యమేనని చెప్పొచ్చు. అందుకే ప్రవేశాల ప్రక్రియలో మంచి కళాశాలలో...కోరుకున్న బ్రాంచి పొందడానికి ఉత్తమ ర్యాంకు ఎంత ముఖ్యమో...వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవడంపై అవగాహనతో వ్యవహరించడమూ అంతే ముఖ్యం.

సీటుకు ఎసరు రావొద్దంటే?

వెబ్ కౌన్సెలింగ్‌లో మెరుగైన/ఆశించిన సీటు రావాలంటే ఎక్కువ ఆప్షన్లు పెట్టుకోవాలని నిపుణులు చెపుతుంటారు. కానీ చాలామంది విద్యార్థులకు ఎక్కువ ఆప్షన్లు ఇచ్చుకునే ఓపిక ఉండటం లేదు. అతివిశ్వాసంతో వ్యవహరిస్తూ 30, 40 ఆప్షన్లు పెట్టుకుని ఇవి ఎక్కువే కదా అని భావించి, 'ఇక చాల్లే' అని వదిలేస్తుంటారు. చాలా మంచి ర్యాంకు వచ్చినవారికి ఇది సరిపోతుంది కానీ వేలల్లో ర్యాంకులు వచ్చినవారికి అసలు సీటే రాకపోవచ్చు! ర్యాంకుకు తగిన, అత్యధిక ఆప్షన్లు పెట్టుకోకపోవటం వల్లనే ఈ సమస్య ఏర్పడుతుంది.

గత ఏడాది కౌన్సెలింగ్ తీరును బట్టి ఏ కాలేజీలో, ఏ బ్రాంచిలో సీటుకు అవకాశం ఉందో దాదాపు అంచనా వేసుకోవచ్చు. అలా తప్పనిసరిగా వస్తాయనుకున్న కళాశాలలు, బ్రాంచిల ఆప్షన్లను అత్యధికంగా తప్పనిసరిగా పెట్టుకోవాల్సిందే. వాటితోపాటు అంతకంటే మెరుగ్గా ఉన్నవాటిని కూడా ఆప్షన్లుగా పెట్టుకోవడం మర్చిపోకూడదు. ఎందుకంటే... మీరు పెట్టిన ఆప్షన్ మీ ర్యాంకుకు ఎక్కువే అయివుండొచ్చు కానీ.. అప్పటికి అది ఖాళీగా ఉంటే ఆ రాదనుకున్న కళాశాల, బ్రాంచి మీకే రావటానికి ఆస్కారం ఉంటుంది.

పెద్ద ర్యాంకులు వచ్చినవారు ఓపికగా కనీసం 200 ఆప్షన్లు... మరీ పెద్ద ర్యాంకు అయితే 400, అంతకంటే ఎక్కువ ఆప్షన్లు పెట్టుకోవడం శ్రేయస్కరం. గరిష్ఠంగా ఎన్ని ఆప్షన్లు అయినా పెట్టుకోవచ్చు! దానికి ఎలాంటి పరిమితీ లేదు.

✺ ఒక ప్రముఖ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈకి 3 వేలతో చివరి ర్యాంకు ముగిసింది. దాంతో 2,600 ర్యాంకు వచ్చిన విద్యార్థి ఒకరు 3 వేల ర్యాంకుతో ముగిసిన కళాశాలల్లో సీఎస్ఈకే వెబ్ ఆప్షన్లు ఇచ్చాడు. ఫలితం ఆ విద్యార్థికి మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీటు చేజారింది. ✺ 2,800 ర్యాంకు దక్కించుకున్న ఓ అమ్మాయి కేవలం విశ్వవిద్యాలయాల కళాశాలలు, రెండుమూడు ప్రముఖ కళాశాలల్లోనే వెబ్ ఆప్షన్లు ఇచ్చుకుంది. కచ్చితంగా సీటు వస్తుందన్న అతి విశ్వాసానికి పోయింది. చివరకు సీటే దక్కలేదు. గత ఏడాది తెలంగాణ మొదటి విడత కౌన్సెలింగ్‌లో విద్యార్థులు చేసిన పొరపాట్లు ఇవీ.

పారాహుషార్... పొరపడద్దు

✺ మొదటి విడత కౌన్సెలింగ్ చాలా కీలకం. రెండో విడతలోకి వచ్చేసరికి నాణ్యమైన కళాశాలల్లో సీట్లు నిండుతాయి. అందువల్ల రెండో కౌన్సెలింగ్ లేదని భావించి మొదటి విడతలో ప్రాధాన్యక్రమంలో ఆప్షన్లు ఇచ్చుకోవాలి. ✺ మీ ర్యాంకుకు గత ఏడాది కోరుకున్న బ్రాంచిలో టాప్ 25 కళాశాలల్లో సీటు వస్తే మీరు ఈసారి కనీసం 40 కళాశాలల వరకు దరఖాస్తు చేసుకోవాలి. ఉదాహరణకు మీ ర్యాంకు 4 వేలు అయితే గత ఏడాది 10 వేల ర్యాంకు వరకు సీటు వచ్చిన కళాశాలల వరకు ఆప్షన్లు ఇచ్చుకోవాలి. ఇంకా ఎక్కువ ఇచ్చుకున్నా నష్టం లేదు. ✺ మీ ప్రాధాన్యం కోర్సుకా? కళాశాలకా? అన్నది మొదట సృష్టత తెచ్చుకోవాలి. ఉదాహరణకు కంప్యూటర్ సైన్స్ బ్రాంచిలో మాత్రమే చేరతారనుకుంటే టాప్ కళాశాలల నుంచి ఆ బ్రాంచికి మాత్రమే ఆప్షన్ ఇచ్చుకుంటూ రావాలి. అదే ప్రముఖ కళాశాలల్లో ఏ బ్రాంచి అయినా ఫర్వాలేదు అనుకుంటే ప్రముఖ కళాశాలలను మొదట గుర్తించాలి. ఉదాహరణకు జేఎన్‌టీయూహెచ్‌లో అన్ని బ్రాంచీలకు ఆప్షన్లు ఇవ్వాలి. తర్వాత ఓయూలోని అన్నిటికీ ఇచ్చుకోవాలి. ఆ తర్వాత ప్రముఖ కళాశాలల్లో అన్ని బ్రాంచీలకూ ఇచ్చుకుంటూ వెళ్లాలి. ✺ ప్రభుత్వ కళాశాలల్లో ఏ కోర్సు అయినా ఓకే. ప్రైవేట్ కళాశాలల్లో సీఎస్ఈ అయితేనే చదువుతా అని ఒక విద్యార్థి భావిస్తే. మొదట ప్రభుత్వ కళాశాలల్లో మాత్రమే ఆప్షన్లు ఇచ్చుకోవాలి. అలా కాకుండా ప్రైవేట్ కళాశాలలను మొదట...తర్వాత ప్రభుత్వ కళాశాలలు అంటే నిరాశ తప్పదు.

- బాపనయ్య, శ్రీనివాసరావు ఈనాడు-హైదరాబాద్, అమరావతి

ప్రాధాన్యక్రమంలో రాసుకున్నాకే...

విద్యార్థులు తాము ఏ బ్రాంచిలో చేరాలనుకుంటున్నారు.. ఏ కళాశాలలో చేరాలనుకుంటున్నారో ముందుగా నిర్ణయించుకోవాలి. బ్రాంచి ముఖ్యమా? కళాశాల ముఖ్యమా? అనేది ముందుగా విద్యార్థి, వారి తల్లిదండ్రులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ✺ ఆ తర్వాత ఆ కళాశాల పూర్వాపరాలను తెలుసుకోవాలి. కళాశాల ఎప్పుడు స్థాపించారు. మౌలిక సదుపాయాలు, అధ్యాపకులు, బోధన, క్యాంపస్ ఉద్యోగాలు, ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలించుకోవాలి. ఆప్షన్లు ఇవ్వడానికంటే ముందే ఇవన్నీ విచారణ చేసుకోవాలి. ✺ ఆప్షన్లు ఇచ్చే ముందుకు ఓ పేపర్ తీసుకొని బ్రాంచి, కళాశాలలు, వాటి కోడ్ నంబర్లను ప్రాధాన్య క్రమంలో రాసుకోవాలి. ✺ ఒక జిల్లాలోనే చేరాలనుకునే వారు ఆ జిల్లాలోని కళాశాలలకే ప్రాధాన్య క్రమంలో ఆప్షన్లు ఇచ్చుకోవడం మంచిది. ✺ కళాశాల ప్రధాన రహదారి నుంచి ఎంతదూరంలో ఉంటుంది..? విద్యార్థి నివాస ప్రాంతం నుంచి ఎంత దూరంలో ఉంటుందనేది చూసుకోవాలి. ✺ కళాశాల రుసుములను పరిశీలించుకోవాలి. ఆర్థిక స్థోమతకు అనుగుణంగా కళాశాల రుసుములను ఎంత వసూలు చేస్తున్నాయో తెలుసుకోవాలి. ✺ 10 వేల లోపు ర్యాంకు వచ్చినవారికే ప్రభుత్వం పూర్తిస్థాయిలో బోధన రుసుములు చెల్లిస్తుంది. మిగతావారికి రూ.35 వేల చొప్పున ఇస్తుంది. ✺ ఆప్షన్ల నమోదుకు సంబంధించిన పాస్‌వర్డ్‌ను ఇతరులు ఎవ్వరితోనూ పంచుకోకూడదు. కొన్నిసార్లు పాస్‌వర్డ్‌తో ఆప్షన్లను మార్చివేసే ప్రమాదం ఉంది. ✺ ఇంటర్నెట్ సెంటర్‌ల నుంచి ఆప్షన్లు ఇచ్చేటప్పుడు ఆప్షన్లు ఇచ్చి సబ్‌మిట్ చేసిన తర్వాత లాగవుట్ అవ్వాలి. ఆ తర్వాత బ్రౌజర్ క్లోజ్ చేయాలి. ✺ ఒకేసారి రెండు బ్రౌజర్‌లను వినియోగిస్తూ ఆప్షన్లు ఇవ్వకపోవడం మంచిది. ✺ ఆప్షన్లు ఇచ్చిన ప్రతిసారీ సేవ్ చేసుకుంటూ వెళ్లాలి.

- రఘునాథ్, ఏపీ ఎంసెట్ ప్రవేశాల క్యాంపు అధికారి

ఈసారి పోటీ ఎక్కువే!

గత ఏడాది వరకు ఐఐటీ, ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీల్లో ప్రవేశానికి జోసా కౌన్సెలింగ్ నాలుగైదు విడతల తర్వాత ఎంసెట్ కౌన్సెలింగ్ ఉండేది. ఈసారి జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు రాకముందే ఎంసెట్ కౌన్సెలింగ్ జరుపుతున్నందున అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు వచ్చేవారు సైతం పరిస్థితి ఎలా ఉంటుందోనన్న సంశయంతో ఎంసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొంటారు. అంటే వారికి ఇక్కడ మంచి ర్యాంకులు వస్తాయి కాబట్టి ఈసారి పోటీ పెరగనుంది. తర్వాత వారు జాతీయ విద్యాసంస్థల్లో చేరినా మొదటి విడతలో మాత్రం సీట్లు వారితో నిండుతాయి. అందుకే ఈసారి మరిన్ని వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవడం ముఖ్యం. ■ వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునేముందు ఆప్షన్ల ఫారమ్‌ను వెబ్‌సైట్లో ఉంచాం. దాన్ని ప్రింట్ తీసుకొని కళాశాలలు...బ్రాంచీలు...జిల్లా కోడ్‌లను ప్రాధాన్యాల వారీగా రాసుకోవాలి. వాటిని అప్‌లోడ్ చేసిన తర్వాత ప్రింట్ తీసుకొని ఒకటి రెండు సార్లు పరిశీలించుకోవాలి. ■ ధ్రువపత్రాల సమయంలో ఇచ్చే మొబైల్ నంబరును కళాశాలల్లో చేరేవరకు అదే నంబరు ఉంచుకోవాలి. ఎందుకంటే ప్రతి సందేశం అదే నంబరుకు వస్తుంది.

మూడు దశల్లో.. ఈసారి మూడు దశల్లో కౌన్సెలింగ్ జరుగుతుంది. మూడో దశ తర్వాత ఆగస్టులో ఇంటర్నల్ స్లైడింగ్ ఈసారి కన్వీనర్ ఆధ్వర్యంలోనే జరుగుతుంది. దీంతో దీనిలో పాల్గొని సీట్లు పొందినవారికి అర్హతను బట్టి ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ అవకాశం ఉంటుంది. ఒకే సంస్థకు చెందిన గ్రూప్ ఆఫ్ కాలేజీల్లోంచి ఎంచుకున్నపుడు ఆసక్తి ఉన్న నిర్దిష్ట కాలేజీ కోడ్‌ను సరిగా నమోదు చేయటం అవసరం.

సీటు కేటాయింపు జరిగాక ఆన్‌లైన్లో ఫీజు కట్టి సెల్ఫ్ రిపోర్ట్ చేయాల్సివుంటుంది. కౌన్సెలింగ్‌లో సీటు వచ్చినా నచ్చక రెండో దశలో, మూడో దశలో ప్రయత్నించాలనుకునేవారు మొదట కేటాయించిన సీటుకంటే మెరుగైన ఆప్షన్లను ఎంచుకోవాలి. సీటు కేటాయించగానే తొలి/మలి దశలో కేటాయించిన సీటును కోల్పోతారు. ఈ సీటు కంటే అప్పటి సీటే బాగుందని అనుకున్నా అప్పుడు ప్రయోజనం ఉండదు.

- బి. శ్రీనివాస్, తెలంగాణ ఎంసెట్ ప్రవేశాల క్యాంపు అధికారి

ఎంసెట్ మొదలైతే ఎన్నో డౌట్లు!

- ఏ ర్యాంకుకి ఎక్కడ సీటు?
- బ్రాంచా? కళాశాలా?
- మనకు సరిపోయే బ్రాంచి ఏది?
- మంచి కళాశాల ఎంపిక ఎలా?
- ఏ బ్రాంచి ప్రత్యేకత ఏమిటి?

ఇలాంటి అన్ని ప్రశ్నలకు ఒకే చోట సమాధానాలు

చూడండి.. **www.eenadupratibha.net**

ఐటీనా? సీఎస్ఈనా?

ఇంజినీరింగ్‌లో ఎన్నో బ్రాంచీలు.. ఒక్కో దానికి ఒక్కో ప్రత్యేకత! అయితే కళాశాలల సీట్ల ప్రకారం చూసినా.. ఎంచుకునేవారి సంఖ్యను చూసినా సీఎస్ఈ, ఐటీలకు ఆదరణ ఎక్కువే. అయితే ఏమిటి వీటి ప్రత్యేకత? ఎవరు ఎంచుకోవచ్చు? ఎవరికి నప్పుతుంది?

బ్రాంచీల విశ్లేషణ

ఏమిటీ తేడా?

ఉద్యోగావకాశాలు, కెరియర్‌లో అభివృద్ధి, పని చేసే కోణాల్లోంచి చూస్తే సీఎస్ఈ, ఐటీల మధ్య తేడా కనిపించదు.అయితే మౌలికంగా ఈ రెండింటి మధ్య వ్యత్యాసం ఉంది.

◆ వ్యవస్థల కంప్యూటరీకరణకు అవసరమైన సమగ్ర సాఫ్ట్‌వేర్ వ్యవస్థల అభివృద్ధిపై సీఎస్ఈ దృష్టిసారిస్తుంది. ◆ అభివృద్ధిపరిచే సాఫ్ట్‌వేర్ ప్రజల అవసరాలు, పరిపాలన సౌలభ్యానికి అనువర్తనం చేసే కోణంలో ఐటీ రంగం వినియోగిస్తుంది.

సీఎస్ఈ ఒక ఆపరేటింగ్ సిస్టంను అభివృద్ధి చేస్తే ఐటీ రంగం ఈ ఆపరేటింగ్ సిస్టమ్ ఆధారంగా కొన్ని అప్లికేషన్ ప్రోగ్రామ్‌లను అభివృద్ధి చేస్తుంది. ప్రభుత్వాలు ఉపయోగిస్తున్న మీసేవ, సింగిల్ విండో, ప్రయాణానికి అనుకూలమైన టికెట్ రిజర్వేషన్ సిస్టం.. ఈ కోవలోకి వస్తాయి. అయితే రెండు బ్రాంచీలవారికీ ప్రోగ్రామింగ్ బాగా వచ్చుండాలి. సేవల రంగంలోని సంస్థల్లో పనిచేస్తున్నపుడు రెండు బ్రాంచీల మధ్య ఏ వ్యత్యాసమూ ఉండదు. బీటెక్ స్థాయిలోనూ రెండు బ్రాంచీల మధ్య కొన్ని సబ్జెక్టులు మాత్రమే మారతాయి.

సమకాలీన సమాజంలో అత్యంత ప్రజాదరణ పొందిన, ఉద్యోగాల పట్ల చాలావరకూ గ్యారంటీ ఇవ్వగలిగిన వాటిగా పేరున్నవి- కంప్యూటర్‌సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బ్రాంచీలే. ఉద్యోగాలతో పాటు ఉన్నతవిద్యకూ అవకాశాలు కల్పిస్తున్నాయివి. డిగ్రీ, పీజీ స్థాయుల్లో ప్రవేశాలకు మనదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ఈ బ్రాంచీలకు అధిక సీట్లున్నాయి. నిత్య నూతన ఆవిష్కరణలకు ఆస్కారమిచ్చే బ్రాంచీలివి. బ్యాంకింగ్, ఆసుపత్రులు, మీడియా, ఏర్‌లైన్స్, ఐటీ రంగం.. ఇలా ప్రతి రంగంలోని అవసరాలకు సాఫ్ట్‌వేర్ అవసరం తప్పనిసరి. వర్తమాన, భవిష్యత్ కాలాల్లోనూ ఐటీ నిపుణులకు ఆదరణ తప్పక ఉంటుంది. మంచి విద్యాసంస్థ నుంచి కోర్సు పూర్తిచేసినవారికి ఎన్నో సంస్థలు అవకాశాలు అందిస్తున్నాయి.

ఏం అవసరం?

సీఎస్ఈ/ ఐటీ బ్రాంచీల్లో ఇంజినీరింగ్ చేయాలనుకుంటే ఆప్టిట్యూడ్ నైపుణ్యాలు అవసరమవుతాయి. బలమైన మేథమేటికల్ నైపుణ్యాలతోపాటు గొప్ప ఐక్యూ ఉండాలి. సమస్యకు

సమాధానం కంప్యూటర్ ద్వారా సాధించాలంటే సమాధాన పద్ధతిని ఒక క్రమమైన మార్గంలో పెట్టి ప్రోగ్రామ్‌గా మలచాలి. ఈ స్టెప్పులు వీలైనంత స్పష్టంగా, క్లుప్తంగా ఉండాలి. అంటే ఈ రంగానికి కావాల్సింది- నిశితమైన పరిశీలనాదృష్టి, విశ్లేషణ పటిమ. లాజిక్, రీజనింగ్‌లపై కూడా పట్టు ఉండాలి. ఇంటర్మీడియట్ స్థాయిలో సెట్ థియరీ, ఫంక్షన్స్, రిలేషన్స్, పర్యూటేషన్స్ అండ్ కాంబినేషన్స్, బైనామియల్ థీరమ్, ప్రాబబిలిటీ వంటి అధ్యాయాల్లో మంచి పట్టు అవసరం.

ఉద్యోగావకాశాలు

ప్రస్తుతానికి ఈ బ్రాంచి వారికి మంచి అవకాశాలున్నాయి. అయితే రానున్న 5-10 సంవత్సరాల్లో ఎలాంటి ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయనేది అంచనా వేసుకోవాలి. అందుకు తగ్గట్లుగా ఉద్యోగ సంసిద్ధతకు అవసరమైన మెలకువలు నేర్చుకోవాలి.

అన్ని ఇంజినీరింగ్ రంగాల్లోలాగానే వీరు కూడా మూడు ముఖ్య విభాగాల్లో పనిచేస్తారు. 1. టెక్నాలజీ డెవలపర్లుగా డిజైన్ విభాగం, 2. ఉత్పత్తి రంగంలోని (ప్రొడక్ట్ బేస్డ్) డెవలప్‌మెంట్ సంస్థల్లో 3. సేవల రంగంలో. మొదటి కోవలో.. యాపిల్, ఐబీఎం, గూగుల్, ఇంటెల్, మైక్రోసాఫ్ట్, అమేజాన్, మైక్రాన్ టెక్నాలజీస్, వెస్ట్రన్ డిజిటల్ వంటి సంస్థలుంటాయి. ఒరాకిల్, సన్ మైక్రోసిస్టమ్స్, శాప్, సిమాంటిక్ కార్పొరేషన్ వంటి సంస్థలు రెండో కోవకు చెందినవి. టీసీఎస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, కాగ్నిజాంట్, ఇన్ఫోసిస్ మూడో కోవకు చెందుతాయి.

బిజినెస్ ఇంటెలిజెన్స్ అనలిస్ట్: ఈ ఉద్యోగానికి డేటా ఆధారంగా ట్రెండ్ అనాలిసిస్, ప్రోగ్రామింగ్, వివిధ కోణాల్లో నుంచి డేటా అనాలిసిస్ (దీన్నే డేటా క్యూబ్ టెక్నాలజీ అంటారు) చేయాల్సి ఉంటుంది. ఈ స్థాయిలో వ్యాపారాభివృద్ధికీ, విస్తరణకూ గల అవకాశాలపై సంస్థలకు సలహాదారుగా వ్యవహరిస్తారు. ఇది మధ్యస్థాయి అనుభవంతో కూడుకున్న ఉద్యోగం. ఇందులో రాణించాలంటే సంస్థల నిర్మాణం, నిర్వహణల పరిచయం, అవగాహన పెంచుకోవాల్సి ఉంటుంది.

డేటా సైంటిస్ట్: డేటా విశ్లేషణ బాగా తెలుసుకోవాలి. వైవిధ్యమున్న డేటాను సమగ్రంగా విశ్లేషించి, డేటాలో అంతర్లీనంగా ఉన్న కొన్ని డేటా పాటర్న్‌లను వెలికితీసి వ్యాపారాభివృద్ధికి సూచనలు ఇవ్వగలగాలి. స్టాటిస్టిక్స్, మెషిన్ లర్నింగ్, పైథాన్, ఆర్ ప్రోగ్రామింగ్, ఎస్‌క్యూఎల్‌ల్లో ప్రవేశం అవసరం.

డేటాబేస్ డెవలపర్: ఒరాకిల్, డీబీఎంఎస్ వంటి డేటా బేస్ సిస్టమ్స్‌లోనూ హెచ్‌టీఎంఎల్, జావా స్క్రిప్టింగ్‌ల్లో ప్రవేశం, విశ్లేషణ శక్తి అవసరం.

టెస్టింగ్: డెవలపర్లు రాసిన ప్రోగ్రామ్‌లు అనుకున్న విధంగా పనిచేస్తున్నాయో లేదో తెలుసుకోవాలంటే వాటిని పరీక్షించాల్సి ఉంటుంది. దానికి సాఫ్ట్‌వేర్ టెస్టర్లు అవసరమవుతారు.

ఇవేకాకుండా... నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, డేటా సెక్యూరిటీ, అడ్మినిస్ట్రేటర్, మొబైల్ డెవలపర్, యాప్ డెవలపర్, ఏఆర్/ వీఆర్ డెవలపర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్ వంటి ఉద్యోగావకాశాలున్నాయి. బీపీఓ/ కేపీఓ రంగాల్లో సపోర్ట్ ప్రొఫెషనల్స్ గానూ అవకాశాలుంటాయి.

ఉన్నత విద్య

ఈ బ్రాంచిల్లో కోర్సు పూర్తిచేసినవారు అన్ని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లోనూ ఎంటెక్ చేయడానికి అవకాశాలున్నాయి. అయితే ఎక్కువశాతం విద్యార్థులు విదేశాల్లో ఎంఎస్ చేయడానికే మొగ్గు చూపుతున్నారు.

- నీలమేఘశ్యామ్ దేశాయి, ఏస్ ఇంజినీరింగ్ కాలేజ్

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

యూపీఎస్సీ

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వివిధ కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ తదితరాలు.

ఖాళీలు: 65 **అర్హత, వయసు:** నిబంధనల ప్రకారం. **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **దరఖాస్తు ఫీజు:** రూ.25

చివరి తేదీ: 14.06.2018 **వెబ్‌సైట్:** https://upsconline.nic.in/

రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్

సంస్థ: డాక్టర్ రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్, న్యూదిల్లీ.
పోస్టు: జూనియర్ రెసిడెంట్

ఖాళీలు: 68 **అర్హత:** ఎంబీబీఎస్ ఉత్తీర్ణత. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: రాతపరీక్ష ద్వారా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. **దరఖాస్తు ఫీజు:** రూ.500. **వెబ్‌సైట్:** http://www.rmlh.nic.in/

ఐఐటీ, మద్రాసు

సంస్థ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), మద్రాస్

పోస్టు: ప్రాజెక్ట్ అసోసియేట్ (తాత్కాలిక)

ఖాళీలు: 12 **అర్హత:** 60శాతం మార్కులతో సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్, అనుభవం. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా.

దరఖాస్తు: ఆన్‌లైన్ **చివరి తేదీ:** 07.06.2018

వెబ్‌సైట్: https://icsris.iitm.ac.in/recruitment/

ప్రవేశాలు

ఏఎన్‌జీఆర్‌ఏయూ అగ్రిసెట్-2018

గుంటూరులోని ఆచార్య ఎన్.జి.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ (ఏఎన్‌జీఆర్‌ఏయూ) 2018-19 సంవత్సరానికిగానూ బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశానికి ప్రకటన విడుదల చేసింది. **కోర్సు:** బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ **కాలవ్యవధి:** 4 సంవత్సరాలు

మొత్తం సీట్ల సంఖ్య: 72 **అర్హత:** ఆచార్య ఎన్.జి.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీల నుంచి అగ్రికల్చర్/ సీడ్ టెక్నాలజీ/ ఆర్గానిక్ ఫార్మింగ్ సబ్జెక్టుల్లో రెండేళ్ల డిప్లొమా ఉత్తీర్ణత. **వయసు:** 17-22 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** ప్రవేశ పరీక్ష (అగ్రిసెట్) ద్వారా. **పరీక్ష తేదీ:** 29.07.2018

దరఖాస్తు: ఆఫ్‌లైన్ **దరఖాస్తు ఫీజు:** రూ.500

చివరి తేదీ: 25.06.2018 (రూ.1000 అపరాధ రుసుముతో 29.06.2018) **వెబ్‌సైట్:** https://www.angrau.ac.in/

ఐజీఎన్‌సీఏ, న్యూదిల్లీ

న్యూదిల్లీలోని భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు చెందిన ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ) 2018-19 సంవత్సరానికిగానూ పార్ట్ టైమ్ పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కాలవ్యవధి: ఒక ఏడాది

విభాగాలు: కల్చరల్ ఇన్ఫర్మేటిక్స్, ప్రివెంటివ్ కన్జర్వేషన్, బుద్ధిస్ట్ స్టడీస్, డిజిటల్ లైబ్రరీ అండ్ డేటా మేనేజ్‌మెంట్, మ్యూనుస్క్రిప్టాలజీ అండ్ పేలియోగ్రఫీ.

సీట్ల సంఖ్య: ఒక్కో కోర్సులో 25 చొప్పున మొత్తం 125 **అర్హత, వయసు, ఎంపిక:** ఐజీఎన్‌సీఏ నిబంధనల ప్రకారం. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్

చివరి తేదీ: 30.06.2018

వెబ్‌సైట్: http://ignca.gov.in/

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

ఎంసీఈఎంఈ, సికింద్రాబాద్

సంస్థ: మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్ (ఎంసీఈఎంఈ), తిరుమలగిరి, సికింద్రాబాద్.

పోస్టులు: ల్యాబ్ అసిస్టెంట్, లైబ్రరీ అసిస్టెంట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ తదితర టీచింగ్, నాన్ టీచింగ్ (కాంట్రాక్టు).

ఖాళీలు: ఎంసీఈఎంఈ నిబంధనల ప్రకారం.

అర్హత: పదోతరగతి, డిగ్రీ, ఇంజినీరింగ్ డిప్లొమా, ఎంఈ/ ఎంటెక్/ ఎంసీఏ/ ఎంఎస్, పీహెచ్‌డీ, అనుభవం.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా.

ఇంటర్వ్యూ తేదీ: 2018 జూన్ 5 నుంచి 7 వరకు.

వేదిక: ఎంసీఈఎంఈ, తిరుమలగిరి, సికింద్రాబాద్.

మరిన్ని నోటిఫికేషన్ల కోసం **www.eenadupratibha.net** చూడవచ్చు.